

ఖమ్మం నగరంలో..



సత్తుపల్లి పట్టణంలో...



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కూనంనేని



ఈద్గాహ్‌ల వద్ద చిన్నారుల ఆలింగనం



పాల్వంచ పట్టణంలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్





- త్యాగాల పండుగను జరుపుకున్న ముస్లింలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కిక్కిరిసిన ఈద్గాహ్‌లు
- అన్ని చోట్లా 'ఈద్ ఉల్ అజ్ హా' నమాజులు
- పలు చోట్ల హాజరై విషెస్ చెప్పిన ప్రముఖులు



ఖమ్మం నగర పరిధిలోని ఈద్గాహ్ వద్ద నమాజు ఆచరిస్తున్న ముస్లింలు

ఖమ్మం, జూన్ 17 : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 6:45 గంటల నుంచి 8:30 వరకు మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద వేలాది మంది ముస్లింలు 'ఈద్ ఉల్ అజ్ హా' ప్రత్యేక నమాజును ఆచరించారు. జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరుల్లోని ఈద్గాహ్‌లు కిక్కిరిసి కన్పించాయి. అనంతరం త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగలో భాగంగా 'ఖుర్బానీ' చేశారు. నమాజు అనంతరం తమ తాహతకు తగ్గట్లుగా గొర్రెల వంటి వాటిని ఖుర్బానీ చేసి ఆ మాంసాన్ని పంచిపెట్టారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ఈద్గాహ్ వద్ద ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వివిధ రకాల మాంసాన్ని మూడు భాగాలుగా చేశారు. ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు, ఇంకో భాగాన్ని తమ ఇంటికి వినియోగానికి ఉపయోగించుకున్నారు. కాగా, ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగలలో రంజాన్ తరువాత మరో ముఖ్యమైన పండుగ బక్రీద్.



ఖురాన్ బోధిస్తున్న మత పెద్ద

ఇబ్రహీం అలైహిస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాంల త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రవక్తలు అల్లాహ్ సందేశం వినిపించారు. బక్రీద్ పండుగ పేరు ఈద్ ఉల్ అజ్ హా అని పేర్కొనబడిందని, ఖుర్బానీ అంటే సమర్పణ, త్యాగం, బలి అనే అర్థాలు ఉన్నాయని వివరించారు.

## ప్రముఖుల శుభాకాంక్షలు..

జిల్లాలోని ఆయా ఈద్గాహ్‌ల్లో ప్రత్యేక నమాజులు ఆచరిస్తున్న ముస్లింల వద్దకు పలువురు ప్రముఖులు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇల్లెందులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ తదితరులు ఈద్గాహ్‌ల వద్ద ముస్లింలను ఆలింగనం చేసుకొని విషెస్ చెప్పారు. బక్రీద్ ప్రత్యేకత గురించి వివరించుకున్నారు.





ఖమ్మం నగరంలో ప్రత్యేక నమాజులో ముస్లింలు...



అశ్వారావుపేట పట్టణంలో ఈద్గాహ్ వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు

# సింగరేణి ఐటీ విభాగానికి జాతీయస్థాయి అవార్డు

### అభినందనలు తెలిపిన సీఎండీ



అవార్డును అందుకుంటున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 17 : సింగరేణి సంస్థ ఉద్యోగుల సమాచారానికి, సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని విస్తృతంగా వాడుతున్నందుకు గుర్తింపుగా కంప్యూటర్ ఎక్స్‌ప్రెస్ అనే సంస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఐటీ సేవల కంపెనీగా సింగరేణికి అవార్డును అందజేసింది. ఆదివారం రాత్రి జైపూర్‌లో జరిగిన జాతీయస్థాయి సమావేశంలో ఈ అవార్డును సింగరేణి సంస్థకు ప్రదానం చేశారు. సోమవారం ఉదయం సింగరేణి భవన్‌లో జీఎం కో ఆర్డినేషన్ దేవేందర్ నేతృత్వంలో ప్రాజెక్టు మేనేజర్ ఐటీ హరప్రసాద్, ఐటీ డిప్యూటీ జీఎంలు హరిశంకర్, హరిప్రసాద్, మేనేజర్ ఐటీ రామలక్ష్మయ్య ఈ పురస్కారాన్ని సీఎండీకి అందించారు. ఉద్యోగుల సమస్త సమాచారం, ప్రమోషన్లు తదితర అన్ని విషయాలను ఎంప్లాయి సర్వీస్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా పొందుతున్నందుకు ఈ జాతీయస్థాయి సమావేశంలో ప్రత్యేక ప్రశంస లభించింది. సింగరేణి సంస్థ ఎస్‌ఏపీని అమలు జరిపిన దేశంలోని మొట్టమొదటి బొగ్గు ఉత్పాదన కంపెనీగా కూడా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తున్నందుకు మరో అవార్డు లభించడం పట్ల సంస్థ సీఎండీ బలరాం తన అభినందనలు తెలిపారు.

# పశువులకు నిలయంగా పాఠశాల

### సెలవుల్లో చెట్ల కింద కట్టేస్తున్న పక్కింటి పాడి రైతు
### స్కూలు గేటుకు తాళం వేయకపోవడంతో నిత్యకృత్యం
### పశువులకు వేదికైన గొల్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

రఘునాథపాలెం, జూన్ 17: విద్యార్థులు విద్యాబుద్ధులు అందించే ఆ బడి పశువులకు కొట్టమైంది. సెలవుల్లో అయితే ఏకంగా నిలయంగా మారుతోంది. ఉపాధ్యాయుల పట్టింపులేకపోవడం.. పక్కింటి పాడి రైతుకు వరంగా మారింది. పాఠశాల ఉన్నప్పుడు విద్యార్థులతో కనిపించే ఆ పాఠశాల.. సెలవుల్లో మాత్రం పశువుల పాకగా దర్శనమిస్తోంది. పాఠశాలకు సెలవులు వచ్చినప్పుడల్లా పక్కింటి పాడి రైతు ఆ పాఠశాలను ఎంచక్కా తన గేదెలకు ఆశ్రయంగా వినియోగించుకుంటున్నాడు. అయితే, పాఠశాల గేటుకు తాళం వేయకపోవడంతోనే ఈ తంతు నిత్యకృత్యంగా జరుగుతోందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన ఖమ్మం నగర పరిధిలోని గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో కనిపించింది. ఆదివారం వారంతం, సోమవారం బక్రీద్ కావడంతో పాఠశాలకు వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో ఆ పాఠశాల పక్కన నివాసం ఉండే ఓ పాడి రైతు తన పశువులను ఈ స్కూలు ప్రాంగణంలోని చెట్ల కింద కట్టేసి ఉంచుతున్నాడు. బడి పిల్లలు ఉండే పాఠశాల ప్రాంగణంలో పశువులు దర్శనమిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గొల్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కట్టేసి ఉన్న గేదెలు

# 'పేట' రక్షకభట నిలయం.. నిత్య వివాదాలమయం

- సాక్షాత్తూ పోలీసులు, సిబ్బందిపై అవినీతి మరకలు
- పోలీసు స్టేషన్లో అన్యాయం జరుగుతోందంటున్న బాధితులు
- ఇటు సిబ్బంది పట్ల అధికారి దూషణలు, దుర్భాషలు
- అటు ఉన్నతాధికారులకు కానిస్టేబుల్ ఫిర్యాదులు
- శాంతిభద్రతల కంటే సంపాదనకే ప్రాధాన్యమన్నట్లు ఆరోపణలు
- స్థానిక పోలీసులపై మండల ప్రజల్లో చులకన భావం
- ఇక్కడి అధికారులపై ఉన్నతాధికారుల అసంతృప్తి





అశ్వారావుపేట పోలీస్ స్టేషన్

అశ్వారావుపేట, జూన్ 17 : అభాగ్యులకు అండగా నిలవాల్సిన అశ్వారావుపేట రక్షకభట నిలయం ఇటీవల తరచూ వివాదాలమయంగా మారుతోంది. సాక్షాత్తూ ఇక్కడి పోలీసులు, సిబ్బందికి అవినీతి మరకలు అంటుకుంటున్నాయి. న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్లిన తమకు అన్యాయం జరుగుతోందంటూ పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇక నిష్పక్షపాత విధుల నిర్వహణ, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణ వంటి వాటికంటే సంపాదనకే ఇక్కడి పోలీసులు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా స్థానిక పోలీసులపై మండల ప్రజలకు చులకన భావం ఏర్పడింది. మరోవైపు ఇక్కడి సిబ్బందిపై పోలీసు అధికారులు అమర్యాదగా ప్రవర్తిస్తుండడం, దూషణలు, దుర్భాషలు వంటివి చేస్తుండడం వంటివి కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో విసిగిపోయిన కొందరు సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలాంటి వివాదాలపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు కూడా అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

## సిబ్బందిపై దుర్భాషలు..

అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌పై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయం కోసం స్టేషన్ మెట్లు ఎక్కినా అన్యాయమే జరుగుతోందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి సిబ్బందిని సమన్వయం చేసుకోవాల్సిన ఓ అధికారి.. తన అక్రమార్జనకు సహకరించని, మాట వినని సిబ్బందిపై దుర్భాషలాడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ దూషణలకు మనస్తాపం చెందిన ఓ కానిస్టేబుల్ ఆ అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడిపై కక్షపెంచుకున్న సదరు అధికారి.. ఆ కానిస్టేబుల్‌పై మరో కానిస్టేబుల్‌తో డివిజనల్ స్థాయి అధికారికి ఫిర్యాదు చేయించాడు. మొదటి కానిస్టేబుల్ తోటి సిబ్బందిని వేధిస్తున్నాడంటూ తప్పుడు కంప్లెయింట్ ఇప్పించాడు. ఇదే క్రమంలో న్యాయం కోసం స్టేషన్‌కు వస్తున్న బాధితుల విషయంలోనూ ఇలాంటి ఘటనలే చోటుచేసుకుంటున్నాయి. బాధితులెవరైనా న్యాయం కోసం వచ్చి ఫిర్యాదులు అందిస్తే.. వారి ప్రత్యర్థులను కేసుల నుంచి తప్పించడానికి స్వయంగా పోలీసులే ప్రత్యర్థులతో ప్రతి ఫిర్యాదు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలాంటి వివాదాల నేపథ్యంలో ఇక్కడి పోలీసుల తీరుపై జిల్లా ఉన్నతాధికారులు సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో ఇక్కడి అధికారి, సిబ్బంది మధ్య మరో సర్కిల్ స్థాయి అధికారి సమన్వయ సమావేశం నిర్వహించినా ప్రయోజనం లేకపోయింది.

## ఇటీవల వచ్చిన ఆరోపణల్లో కొన్ని..

- ★ గత నెల 9న పాపిడిగూడెం రోడ్డులో ఒక ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పంచనామా కూడా సిద్ధమైంది. కానీ కేసు నమోదు కాలేదు.
- ★ ఈ నెలలోనే గుమ్మడవల్లి సమీపంలో జరిగిన కోడి పందేల కేసు పలు మలుపులు తిరిగింది. పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి బైకులు, కోడి పుంజులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. కానీ పందేలు నిర్వాహకుడిని వదిలేసి.. పట్టుబడిన జూదరుల్లో కొందరిపైనే కేసులు నమోదు చేశారు. ఈ విషయంలో జూదరుల్లో ఒకరైన సాయిల అశోక్ బహిరంగంగానే ఆరోపణలు చేశాడు. పైగా ఖర్చుల నిమిత్తం నిందితుల్లో ఒక్కొక్కరూ రూ.1,500 చొప్పున ఇవ్వాలంటూ ఇక్కడి పోలీసులు డిమాండ్ చేసినట్లు వాపోయాడు
- ★ ఈ నెల 7న ఇసుక లేకుండా ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. విడుదల కోసం యజమాని నాగరాజు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నాడు. కానీ ట్రాక్టర్‌ను రిలీజ్ చేయడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారు. అయితే కేసు నమోదు సమయంలో ట్రాక్టర్‌లో ఇసుక ఉన్నట్లుగా పంచనామా చేసినట్లు సమాచారం. ఆర్డర్ ప్రకారం ఇసుకను రెవెన్యూ శాఖకు అప్పగించిన తర్వాతే ట్రాక్టర్ విడుదలవుతుంది. లేని ఇసుకను ఎక్కడ నుంచి తేవాలనే సంశయంతోనే ట్రాక్టర్ విడుదల ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.
- ★ అదే రోజు వినాయకపురంలో మట్టి తరలిస్తున్న ఒక జేసీబీని, ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మతలబుల అనంతరం వాటిని వదిలేశారు.
- ★ గత నెలలో అనంతారం వాగు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్న సిబ్బంది కేసు నమోదు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు మందలించడంతో కేసు నమోదు చేశారు.
- ★ విధుల్లో ఉన్న సిబ్బందిపై ఒక అధికారి దుర్భాషలాడారు. దీనిపై ఒక కానిస్టేబుల్ ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. ఈ వ్యవహారం నుంచి తప్పించుకోవటానికి సదరు అధికారి తనకు అనుకూలమైన మరో కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లి మరీ మొదటి కానిస్టేబుల్‌పై ప్రతి ఫిర్యాదు చేయించాడు.
- ★ పశువులు తరలిస్తూ పట్టుబడిన వాహనాల రిలీజ్‌తో పాటు నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు వాహన సామర్థ్యాన్ని బట్టి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- ★ కోడిపందేల్లో పట్టుబడిన వాహనాలను స్వాధీనం చేసుకోకుండా, జూదరులను అదుపులోకి తీసుకోకుండా ఇళ్లకు పంపించి వేస్తున్నారు. తరువాత స్టేషన్‌కు తీసుకొస్తున్నారు. స్టేషన్ అధికారి సొంత చట్టం అమలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అనేక అవినీతి ఆరోపణలు స్టేషన్‌లోని మరి కొందరు సిబ్బంది కూడా ఎదుర్కొంటున్నారు.
- ★ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కేసును తారుమారు చేశారన్న ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. తొలుత బాలిక అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేసిన పోలీసులు.. తర్వాత నిందితుడిని తప్పించే విధంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఆ బాలిక అదృశ్యం కాలేదని, తన బంధువుల ఇంటికి వెళ్లిందని కేసును మార్చినట్లు సమాచారం. కానీ బాలిక తన ప్రేమికుడితో కలిసి ఏపీలోని కుక్కునూరు మండలానికి వెళ్లింది. అక్కడ వారు శారీరకంగా కలుసుకోవడాన్ని గుర్తించిన పోలీసులు.. బాలికను అశ్వారావుపేట తీసుకొచ్చి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారనే వాదన బలంగా వినిపిస్తోంది.

### ఆరోజు కొన్ని బైకులు వదిలేశారు..



అప్పట్లో కోడిపందేల కేసులో పందేలు నిర్వహించిన అసలు వ్యక్తిని పోలీసులు కేసు నుంచి తప్పించారు. అదే కేసులో రెండు బైకులను వదిలిపెట్టారు. ఇదేమిటని అడిగిన మాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా ఖర్చుల కింద ఒక్కొక్కరి నుంచి రూ.1,500 చొప్పున అడిగారు. తాము ఇవ్వలేమని చెప్పినా వినడం లేదు.

–సాయిల అశోక్, గుమ్మడవల్లి

### ప్రజల అపోహలు మా దృష్టికి వచ్చాయి..



పోలీస్ స్టేషన్ పనితీరు, సిబ్బంది వ్యవహారం వంటి అంశాలపై ప్రజల్లో ఉన్న అపోహలు మా దృష్టికి వచ్చాయి. శాంతి భద్రతల పరిరక్షణే మా కర్తవ్యం. ఎవరికీ ఎటువంటి అన్యాయమూ జరగకుండా చట్టపరంగా వ్యవహరిస్తాం. అపోహలను ప్రజలు నమ్మవద్దు.

–జితేందర్‌రెడ్డి, సీఐ, అశ్వారావుపేట

# 'ప్రియాంక' సేవలు ప్రశంసనీయం

### బదిలీ కలెక్టర్ వీడ్కోలు కార్యక్రమంలో భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ఇన్నాళ్లూ విధులు నిర్వహించిన డాక్టర్ ప్రియాంక సేవలు ప్రశంసనీయమైనవని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ప్రియాంక దంపతులను కొత్తగూడెంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రియాంక దంపతులను శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడంలో కలెక్టర్‌గా ప్రియాంక కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఇటు ప్రజలకు, అటు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఎన్నికలను సమర్థంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఆమె ఇలాగే ఉత్తమ సేవలందించాలని, ప్రజలకు మరింత మంచి చేయాలని, అందరి మన్ననలూ పొందాలని ఆకాంక్షించారు. నాయకులు ఆళ్ల మురళి, నాని, భూక్యా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రియాంక దంపతులను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు